# 'ఉత్తరం వచ్చింది'

## - రంగిరెడ్డి చంద్రశేఖర్

ఉదయం నుంచీ ఒకటే ముసురు. ఆకాశం అంతా దట్టమైన మబ్బులు. ఆ మబ్బుల్ని చీల్చుకొని వాన కుండపోతగా కురుస్తూనే వుంది. అసలే అది పల్లెటూరు కావడంతో రోడ్లన్నీ కాలువలైపోయాయి. ఆ ఊరు జనాభా అంతా కలిసి మహా అయితే ఆరువేలకు మించదు. ఊళ్లో వున్నది ఒకే ఒక పోస్టాఫీస్. అలాగే ఆ ఊళ్ళో ప్రజలందరికీ ఉత్తరాలు సరఫరా చేసే పోస్టు ఉమన్ ఒక్కరే. ఆమె పేరు కాంతం. అంత వానలోనూ గొడుగు పట్టుకొని ఉత్తరాల్ని తడవకుండా ఒక పాలిథిన్ కవర్‌లో చుట్టుకొని కాంతం తన డ్యూటీకి బయలుదేరింది. ఎండొచ్చినా, వానొచ్చినా ఆమెకి మాత్రం డ్యూటీ తప్పదు.

ఒకటా? రెండా? గత 35 సంవత్సరాలుగా ఆమె చేస్తున్న ఉద్యోగం ఇదే. పోస్ట్‌మేన్‌లు అయితే ఇంటింటికీ సైకిల్‌మీద తిరిగి ఉత్తరాలు ఇస్తారు. కాని కాంతం నడిచే ఉత్తరాలు ఇస్తుంది. భుజాన సంచీ, చేతిలో ఉత్తరాలు పట్టుకొని గొడుగు నీడన వీధి వీధికి కాలి నడకన వెళ్ళే కాంతాన్ని చూడగానే ఆ గ్రామంలో వారందరి ముఖాలు వికసిస్తాయి. ఆమె అందించే క(బు)వరు ఆత్రంగా అందుకుంటారు. అంతేనా! కబురు తెచ్చిన కష్ట సుఖాలనూ ఆమెతో పంచుకుంటారు. అంతగా వారి జీవితాల్లో ఆ 'పోస్టు ఉమన్' మమేకమై పోయింది.

నిజానికి కాంతానికి ఈ ఉద్యోగం విధివైపరీత్యం వల్ల వచ్చింది. కాంతం భర్త ఆ ఊళ్ళోనే పోస్ట్ మేన్‌గా ఉద్యోగం చేసేవాడు. పాపం! పెళ్ళయిన కొద్ది కాలానికే ఆమె భర్త మరణించడంతో ఉన్న ఒక్కగానొక్క కొడుకుని పెంచుకోడానికి ఆమెకీ ఉద్యోగం చేయక తప్పలేదు. అప్పట్లో పాతిక రూపాయల జీతంతో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన కాంతానికి ఇక రిటైర్ అయ్యే ఈ ఆఖరి దశలో లభించే జీతం కూడా చాలా తక్కువే. 35 ఏళ్ళ శ్రమ ఫలితం ఇప్పుడు ఆమెకి వస్తున్న జీతం కేవలం 900 రూపాయలు అంటే నమ్మశక్యం కాదు. అయితే ఇక రిటైర్ అయిపోతున్నానని వచ్చే నెల నుంచి తనకు ఈ జీతం కూడా రాదనే భయం ఆమెకి లేదు. తన 35 ఏళ్ళ సర్వీసులో ఆమె ఎన్నో వేల ఉత్తరాలు బట్వాడా చేసింది. ఇంటింటికీ తిరిగి ఉత్తరాలు ఇచ్చి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం చెప్పలేని అనుభూతి ఇస్తుంది అంటుంది కాంతం. ఆ ఊళ్ళో ప్రజలకి ఆమె అత్యంత ఆత్మీయురాలు.

ముసురుపట్టి ఊళ్లోని ప్రజలంతా తలుపులు బిడాయించుకొని వెచ్చగా ఇళ్లల్లో వుంటే ఆమె మాత్రం తడిసిముద్దయి పోతూ ఉత్తరాలు బట్వాడా చేస్తూనే వుంది. ఎంత గొడుగు నెత్తి మీద పెట్టుకున్నా వర్షపు జల్లులు శరీరాన్ని తడిపేస్తున్నాయి.

వర్షానికి బట్టలు తడిసిముద్దయిపోవడంతో ఆమె చలికి గజగజవణుకుతోంది. చీర కుచ్చిళ్ళు పైకి ఎత్తిపట్టుకొని మోకాలు లోతు నీళ్ళల్లో కాంతం ఆ వీధిలో నడుస్తూ పంచాయతీ ప్రెసిడెంట్‌గారి ఇంటి దగ్గరికి వచ్చింది. ప్రెసిడెంట్ గారి అమ్మాయి రజని ఎప్పటిలాగే ఉత్తరం కోసం ఇంటి అరుగు మీద నుంచొని ఎదురుచూస్తోంది. రజనీకి, కాంతానికి విడదీయలేని అనుబంధం వుంది. రజని చిన్నప్పటి నుంచి కాంతానికి బాగా తెలుసు. ఆమె పెరిగి పెద్దదై విశాఖపట్నంలో ఎం.బి.ఏ. పూర్తి చేసింది. చదువు అయిపోయిన వెంటనే పెళ్లి కూడా కుదిరిపోయింది. రజనికి కాబోయే భర్త అమెరికాలో ఇంజనీరు. త్వరలో పెళ్లి చేసుకుని రజని అమెరికా వెళ్లిపోతుంది. రోజూ అమెరికా నుంచి వచ్చే ఉత్తరాల్ని కాంతం ఎప్పటికప్పుడు భద్రంగా రజనికి అందచేస్తుంది. అమెరికా నుంచి వచ్చే ఉత్తరాల కోసం రజని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటుంది. వారానికి ఒక ఉత్తరమైనా ఖచ్చితంగా ఆమెకి అందుతుంది.

స్వాతి వాన కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పలా ఎదురు చూస్తున్న రజనికి, కాంతం భుజానికి తగిలించుకున్న సంచీ లోంచి ఉత్తరాన్ని తీసి ఆమె చేతిలో పెట్టింది. అంతే! ఆ ఉత్తరం అందుకోగానే రజని మొహం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోయింది. కొత్త పెళ్లి కూతురిలా బోలెడు సిగ్గుపడిపోయి వెంటనే ఇంట్లోకి తుర్రుమని పరిగెత్తి స్వీటు తీసుకొచ్చి కాంతం నోట్లో పెట్టింది. అమెరికా నుంచి వచ్చిన ఉత్తరం తెచ్చిన ప్రతిసారీ ఆమె కాంతం నోటిని తీపి చేస్తుంది. రెండు నిమిషాలు కాంతం రజనీతో ఆ కబురూ, ఈ కబురూ మాట్లాడి అక్కడ్నించి బయలుదేరింది.

వర్షంలో తడిసి ముద్దయి ఊరంతా ఉత్తరాలు పంచి పెట్టి కాంతం ఇంటికి వచ్చింది. ఒంటరి జీవితం ... ఒంటరి బ్రతుకు ... జీవితంలో ఒంటరితనం కన్నా మించిన విషాదం మరొకటి వుండదేమో! ఉత్తరాలు పంచిపెట్టి ఊళ్లో ప్రజలందరి కష్టసుఖాల్లో తను పాలుపంచుకొంటుంది కాని తన కష్ట సుఖాల్లో ఎవరూ పాలు పంచుకోరనే వ్యథ ఆమె నెప్పుడూ దహించి వేస్తుంటుంది. ఉత్తరాలు పంచిపెట్టినంత సేపు డ్యూటీలో ఒంటరితనాన్ని మరచిపోయినా ఇంటికి వచ్చింతర్వాత ఒంటరి తనం ఆమెని పూర్తిగా కమ్మేస్తుంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకుని చదివించి పెంచి పెద్దచేసి ప్రయోజకుడ్ని చేసింది. కాని ఏం ఉపయోగం? మంచి ఉద్యోగం సంపాదించుకున్న కొడుకు ఎవరో అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో స్థిరపడి పోయాడు. తను రెక్కలు ముక్కలు చేసుకొని ఊరంతా తిరిగి ఉత్తరాలు పంచి పెట్టిన డబ్బుతో కన్న కొడుకుని చదివించి వాడి జీవితాన్ని తీర్చిదిద్దితే కనీసం పెళ్లి చేసుకున్న విషయం కూడా చెప్పకుండా రెక్కలొచ్చిన పక్షిలా తుర్రుమని ఎగిరిపోయాడు.

ఊరందరికీ తను ఉత్తరాలు పంచి పెడుతుంది గాని తనకి మాత్రం ఎవరి దగ్గర్నించి ఉత్తరం రాదు. రజనికి అమెరికా నుంచి ఉత్తరం వస్తే ఆమె

ముహం ఎంత ఆనందంతో వెలిగిపోతుందో అలా తన కొడుకు దగ్గర్నుంచి ఉత్తరం వస్తే చూసుకోవాలనే ఆమె ఆశ ఎప్పటికీ తీరలేదు. మూడేళ్లకో, నాలుగేళ్ళకో ఒకసారి చుట్టుపు చూపుగా వచ్చి వెళ్ళిపోతాడు అంతే ఇక మళ్లా ఉత్తరం వుండదు. పత్రం వుండదు. కన్నకొడుకు దగ్గర్నించి కాకపోతే కనీసం బంధువులు ఎవరి దగ్గర్నుంచీకూడా తనకు ఉత్తరాలు రావు. నిజానికి తనకి పున్న బంధువులు కూడా తక్కువే.

**మ్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన '97 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**



తనకి తెలసిన వాళ్ళు ఎవరైనా అభిమానంతో, ఆత్మీయతతో ఉత్తరం వ్రాస్తే దాన్ని చింపి చదువుకుంటే ఆ అనుభూతి ఎలా వుంటుంది? అలాంటి అనుభూతి తన స్వంతం కావాలంటే ఏంచెయ్యాలి? ఈ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి తను అలాంటి

అనుభూతి కోసం ఎదురుచూసింది. కాని తన కోరిక నెరవేరలేదు. ఇక రిటైర్మెంట్ వయసుకూడా దగ్గర కొచ్చేసింది. తనకోరిక నెరవేరుతుందన్న ఆశ కూడా ఇప్పుడు తనకి లేదు. ఇక ఇప్పుడు తన ఆశ ఒక్కటే. రిటైర్ అయిపోయింతర్వాత మిగిలిన జీవితాన్ని కొడుకు సమక్షంలో గడపాలని. కనీసం ఆ కోరిక అయినా నెరవేరుతుందో లేదో అని ఆమె మధన పడుతోంది. రోజులు వేగంగా గడిచిపోయాయి. కాంతం సుధీర్ఘకాలం తపాలాశాఖలో ఉద్యోగం చేసి రిటైర్ అయిపోయింది. ఇన్ని సంవత్సరాలు ఆమె సేవలకు గుర్తింపుగా జిల్లా తపాలా అధికారుల నుంచి సైతం ఆమె ప్రశంసలు అందుకొంది. ఆమె రిటైర్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని తపాలాశాఖవారు ఆమెని ఘనంగా సన్మానించారు. ఒక మహిళ అందునా కాలినడకన 35 ఏళ్ళపాటు ఇంటింటికీ తిరిగి ఉత్తరాలు ఇచ్చినందుకు ఆమెను ప్రశంసిస్తూ పత్రికల్లో సైతం వార్తలు వచ్చాయి. రిటైర్ అవుతున్న సందర్భంగా తనకి జరిగిన సన్మానానికి తన కొడుకు వస్తాడని ఆమె ఎంతో ఆశగా చూసింది. కొడుకు రాకపోయినా తన చిరకాల వాంఛ ఉత్తరం అయినా రాస్తాడేమో అని గంపెడాశతో ఎదురుచూసింది. పాపం! కాంతం రెండు కోరికలు నెరవేరలేదు. రిటైర్ అయిపోయింతర్వాత కాంతం ఇప్పుడు ఇంటి దగ్గరే వుంటోంది. ఇంతకాలం ఉద్యోగం చేస్తూ ఒంటరి తనాన్ని కొంత మరచిపోయినా ఇప్పుడు ఇంటి దగ్గరే వుండటం వల్ల ఆమె ఒంటరి తనవు బాధను భరించలేకపోతోంది. తను రావడం తన కొడుక్కి ఇష్టం వుండదని ఆమెకి తెలుసు అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె కొడుకు దగ్గరికి వెళ్లడానికే నిశ్చయించుకొంది.

తన ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము అదీ చేతి కొచ్చాక కాంతం హైదరాబాద్ బయలుదేరడానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకొంది. వెళ్ళిపోయే రోజు ఊరంతా ఇంటింటికీ తిరిగి చెప్పివచ్చింది. కొడుకు దగ్గరికి హైదరాబాద్ వెళ్లిపోతున్నానని. రజని పెళ్లి కూడా అయిపోయింది. ఇవాళ్లో, రేపో రజని అమెరికా వెళ్లిపోతుంది. రజని దగ్గరికివెళ్లి ప్రత్యేకంగా చెప్పివచ్చింది. రజని, కాంతాన్ని తన భర్తకి పరిచయం చేసింది. మీరు రాసిన ఉత్తరాలు భద్రంగా తీసుకొచ్చి ఇచ్చింది ఈవిడేనంటూ. రజని భర్త కూడా కాంతాన్ని అభినందించాడు. చివరికి ఒకటి, రెండురోజుల తేడాలో రజని అటు అమెరికా, కాంతం ఇటు హైదరాబాద్ వెళ్లిపోవడం జరిగాయి.

జీవితం చిత్రమైంది. జీవితంలో మనం అనుకున్నవి ఎప్పుడూ జరగవు. జీవితం అంటే కోరుకున్నవి జరగకపోవడమేనేమో! ఆత్మీయులు ఎవరి దగ్గరినుంచైనా ఉత్తరం వస్తే ఎంత బావుండును అని తను ఎంతగా కోరుకున్నా ఎప్పుడూ తన కోరిక నెరవేరలేదు. ఇప్పుడు శేష జీవితాన్ని కొడుకు దగ్గర ఆనందంగా గడుపుదామన్న కోరిక కూడా కాంతానికి నెరవేరలేదు. రెండు నెలలు ఎలాగోలా గడిచాయి గాని ఆ తర్వాత నుంచి కొడుకు కోడలు తనని ఎంత నిర్లక్ష్యంగా చూస్తున్నారో తెలిసింతర్వాత కాంతానికి దుఃఖం ఆగలేదు. కోడలు తనని పనిమనిషికంటే హీనంగా చూసినా ఆమె భరించింది గాని ఇంటింటికీ తిరిగి ఉత్తరాలు పంచి పెట్టే ఆవిడ నా అత్త అంటే నాకు చాలా అవమానంగా ఉంది అని కోడలు ముఖం మీద అన్నపుడు మాత్రం ఆమె భరించలేకపోయింది. కోడలు విషయం ఎలా వున్నా పెద్ద ఆఫీసర్ పదవిలో వున్న తన కన్న కొడుకు కూడా తనని అసహ్యంగా చూసిం తర్వాత కాంతానికి ఇక అక్కడ వుండబుద్ధి కాలేదు.

ఇక్కడ నేను పెద్ద ఉద్యోగంలో వున్నాను. ఆఫీ



సర్ని కాబట్టి నా ఇంటికి పనుల నిమిత్తం ఎంతో మంది వస్తుంటారు. వాళ్లందరి ముందు మొన్నటివరకు ఉత్తరాలు పంచిపెట్టిన నిన్ను అమ్మ అని చెప్పక్కోవడం నాకు చాలా అవమానంగా వుంది అని కొడుకు ఎప్పుడైతే అన్నాడో ఇక కాంతానికి అక్కడ వుండటం అంటే ముళ్లకంపమీద వున్నట్లుగా వుంది. కొడుకు తనతో అయితే ఆ మాటలన్నాడు కాని ఆ ఉత్తరాలు పంచిపెట్టిన డబ్బుతోనే నువ్వు చదువుకొని ఈ రోజు ఈ హోదాలో వున్నావని కాంతం ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ముళ్ల కంపలమీద నుంచోవడం ఇక కాంతానికి ఇష్టంలేక వెంటనే స్వంత ఊరికి తిరుగు ప్రయాణం కట్టింది.

జనని జన్మభూమి అంటారు. పుట్టిన ఊరుకన్న తల్లికంటే గొప్పది. స్వంత ఊరికి వచ్చింతర్వాత కాంతానికి ప్రపంచాన్ని జయించినంత ఆనందం కలిగింది. ఇదే ఊళ్లో తను 35 ఏళ్ళు పోస్ట్ ఉమన్‌గా పని చేసింది. ఈ ఊరి ప్రజలతో తనకు విడదీయలేని అనుబంధం వుంది. ఈ గడ్డమీద పుట్టాను. ఈ మట్టిలోనే కలసిపోతాను. చనిపోయేంతవరకు ఇక ఈ ఊరు విడిచిపెట్టే ప్రసక్తి లేదు అనుకొంటూ తిరిగి కొత్త జీవితాన్ని ప్రారంభించింది. తనకు వచ్చే పెన్షన్‌తో జీవితాన్ని నెట్టుకురాలేక ఒక ప్రైవేట్ స్కూల్లో ఆయాగా చేరింది. కొడుకు కోడలు దగ్గర రెండు నెలలు నరకం అనుభవించిన తర్వాత ఇప్పుడు స్కూల్లో ఆయాగా తనకి జీవితం ఎంతో ఆనందంగా వుంది. స్కూలు పిల్లలతో గడపడంతో ఒంటరి తనం చాలావరకు పోయింది. ఆత్మీయులు ఎవరి దగ్గర నుంచి తనకు ఉత్తరం రాకపోవడం అనే కోరిక మినహాయించి అంతకంటే ఆమెకు కోరికలు కూడా ఏం లేవు.

స్కూలు సెలవు రోజుల్లో కాంతం ఊరంతా తిరిగి తెలిసిన వాళ్లని పలకరించి వస్తుంది. అప్పుడప్పుడు ప్రెసిడెంట్ గారింటికి వెళ్లి అమెరికాలో రజని కొత్త జీవితం ఎలా వుంది? ఆమె యోగ క్షేమాలు గురించి అడిగి తెలుసుకొంటుంది. ఈసారి అమెరికా ఉత్తరం రాసినప్పుడు అమ్మాయిగార్ని మరీ మరీ అడిగినట్లు చెప్పండని కాంతం ప్రెసిడెంట్‌గారికీ, రజనీ వాళ్ల అమ్మ గారికీ చెప్పింది.

రెండు వారాల తర్వాత ... పోస్ట్ అన్న కేకతో కాంతం ఉలిక్కిపడింది. కల నిజమో ఆమెకి అర్థం కాలేదు. పోస్ట్‌మేన్ స్వయంగా తీసుకొచ్చి ఉత్తరం ఆమె చేతిలో పెట్టాడు. ఎయిర్ మెయిల్ లెటర్ అది. అసలు ఉత్తరం తనకి వచ్చిందా? కాదా? అని అడ్రస్ మరోసారి చూసింది. సందేహం లేదు. తన అడ్రసే. కాంతానికి ఆత్రం ఆగలేదు. గబగబా విప్పి చదివింది. ఉత్తరం చదివింతర్వాత ఆమెకు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినంత ఆనందం కలిగింది. ఆ సమయంలో ఆమె ముఖంలోని భావాలను వర్ణించడానికి మాటలు చాలవు. బహుశా ఆమె జీవితంలో అంతకంటే ఆనందంగా గడిపిన రోజు మరొకటి వుండదేమో! ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివిందో ఆమెకే తెలీదు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరడం లేదు. బహుశాకన్న కూతురు కూడా ఇలా ఉత్తరం రాయదేమో! కడుపున పుట్టకపోయినా ఆమె తనకు కూతురు లాంటిదే.

ఆత్మీయుల దగ్గర నుంచి ఉత్తరం వస్తే అది విప్పి చదివితే ఆ అనుభూతి ఎలా వుంటుందో అది ఇన్నాళ్ళకు తీరింది. ఆ రాత్రి ఆనందంతో ఆమెకు నిద్రపట్టలేదు. ఆ తర్వాత రోజే కాంతం కృతజ్ఞతలు తెలుపుతూ రజనీకి లెటర్ వ్రాసి అమెరికాకి పోస్ట్ చేసింది.

★